నేడు రాష్ట్ర బడ్జెట్

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బడ్జెట్‌ను నేడు ప్రవేశపెట్టనున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు 2024-25 ఆర్థిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలిలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌ను ఆమోదించడానికి ఉదయం 9 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో క్యాబినెట్ సమావేశంకానుంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరిలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. నాలుగు నెలల కాలానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, జూలై నెలాఖరుతో ఓన్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమయం ముగియనుంది. దీంతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు.

2వరకు అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాలను మరో రెండు రోజులు పొడిగించాలని నిర్ణయించారు. బీఏసీ సమావేశంలో ఈనెల 31 వరకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినా, ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ ఒత్తిడితో మరో రెండు రోజులపాటు సభను నిర్వహించాలని నిర్ణయానికి వచ్చినట్టుగా సమాచారం. ఆగస్టు 1, 2న కూడా సభను నిర్వహించాలని నిర్ణయించారు. రైతు భరోసా, రుణమాఫీ, స్కిల్ యూనివర్సిటీ, ఎడ్యుకేషన్ కమిషన్, వ్యవసాయ కమిషన్ తదితర వాటికి సభ ఆమోదం తెలపాల్సి ఉంది. దీంతో సభను మరో రెండు రోజులు పొడిగించినట్టుగా తెలిసింది. అసెంబ్లీతో పాటుగా శాసనమండలి సమావేశాలు కూడా రెండు రోజులు జరగనున్నాయి.

ఆర్టీసీ విలీనం ఎప్పుడు..?

- యూనియన్లను ఎప్పుడు పునరుద్ధరిస్తారు?
- 300 కోట్ల చెక్కు ఇంకా బస్సుభవన్ చేరలేదు
- ప్రభుత్వానికి మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నలు
- రాజకీయ విమర్శలకు దిగిన మంత్రి పొన్నం
- సర్కారు తీరుపై బీఆర్ఎస్ శాసనసభ్యుల నిరసన
- పాడియంలోకి దూసుకెళ్లిన గులాబీ పార్టీ నేతలు



హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీశారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్టీసీపై ప్రశ్నలు సంధించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా విలీనం చేస్తూ అపాయింటెడ్ డే ఎప్పుడు ప్రకటిస్తారు? ఆ ప్రక్రియ ఎందుకు జాప్యమవుతున్నది? ఎప్పటిలోగా అమలుచేస్తారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని, యూనియన్లను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటికి 8 నెలలు గడుస్తున్నా ఆ దిశగా ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టలేదని నిలదీశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆర్టీసీ, సిబ్బంది సంక్షేమంపై ఇచ్చిన హామీలను సభలో చదివి వినిపించారు. పీఆర్సీ పరిధిలోకి టీఎస్ఆర్టీసీ కార్మికులను చేరుస్తామని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు కల్పిస్తామని, ఆర్టీసీ బస్సులను ఆధునీకరించి విస్తరిస్తామని, అధునాతన సౌకర్యాలతో కొత్త సర్వీస్‌లను ప్రారంభిస్తామని, ఆర్టీసీని యూనియన్ పునరుద్ధరణకు అనుమతిస్తామని కాంగ్రెస్ హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా ఏ రోజు నుంచి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారో కచ్చితంగా ఓ తేదీని సభ ద్వారా ఆర్టీసీ కార్మికులకు చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

5 నెలలైనా డమ్మీ చెక్కు నెక్లెస్‌రోడ్ దాటలే!

ఆర్టీసీలో చనిపోయిన కార్మికుల కుటుంబీకులకు బీఆర్ఎస్ ప్రభుత్వం కారుణ్య నియామకం కింద వెంటనే పర్మినెంట్ ఉద్యోగం కల్పించేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కన్సాలిడేటెడ్ పే రూ.15 వేలకు మూడేండ్లు ఉద్యోగం చేయించుకొని ఆ తర్వాత పర్మినెంట్ చేస్తామని చెప్తున్నదని, ఇది చనిపోయిన కార్మికులకు అన్యాయం చేయడమేనని హరీశ్‌రావు మండిపడ్డారు. గత ప్రభుత్వం కొనుగోలు చేసిన నూతన బస్సులను ప్రస్తుత ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిందని, ఆ సందర్భంగా ఒక రూ.300 కోట్ల డమ్మీ చెక్కును చూపిస్తూ ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ బకాయిలను విడుదల చేస్తున్నానని ముఖ్యమంత్రి ప్రకటిస్తూ ఫొటోలు దిగారని, దాదాపు ఐదు నెలలు దాటుతున్నా ఆ చెక్కు నెక్లెస్ రోడ్ దాటి బస్సు భవన్‌కు చేరలేదని ఎద్దేవా చేశారు. గతంలో తమ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్, ఆర్టీసీ కార్మికులకు 44 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని, బడ్జెట్‌లో వేల కోట్లు పెట్టి ఆర్టీసీని కాపాడామని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులపై పనిభారం..

మహాలక్ష్మి పథకానికి సంబంధించిన నిధులను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. మహాలక్ష్మి పథకం తర్వాత పనిభారం పెరిగిందని, సరిపడా సిబ్బందిని నియమించకపోవడం వల్ల ఉన్న కార్మికులే 16 గంటలు, 18 గంటలు పనిచేయాల్సిన వస్తున్నదని, ఫలితంగా పని ఒత్తిడి కిలోనై వందల మంది చనిపోతున్న మాట వాస్తవమా కాదా ? అని నిలదీశారు. పనిభారానికి తగిన విధంగా కండక్టర్లు, డ్రైవర్లను ఎప్పటిలోగా నియమిస్తారని ప్రశ్నించారు.

సమాధానం చెప్పకుండా పొన్నం ఎదురుదాడి

మాజీ మంత్రి హరీశ్‌రావు అడిగిన ప్రశ్నలకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూటిగా సమాధానం చెప్పకుండా రాజకీయ విమర్శలకు దిగారు. ఆర్టీసీని బీఆర్ఎస్ ప్రభుత్వమే నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఆదరాబాదరగా విలీన ప్రక్రియ చేపట్టిందని, ప్రస్తుతం ఆ అంశం తమ పరిశీలనలో ఉన్నదని, ఎలాంటి జాప్యం జరగడం లేదని బదులిచ్చారు. పదేండ్లలో ఒక్క బస్సు కూడా కొనలేదని, తాము అధికారంలోకి రాగానే కొత్త బస్సులు కొన్నామని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.300 కోట్లు కేటాయిస్తున్నామని, ఇప్పటికే 70 కోట్ల మంది మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా, అందుకు సంబంధించి రూ.2400 కోట్లను ఆర్టీసీకి చెల్లించామని తెలిపారు. కారుణ్య నియామకాల ఉద్యోగాలు ఇస్తున్నామని, ఆర్టీసీ తార్నాక హాస్పిటల్‌లో అధునాతన వసతులు కల్పిస్తున్నామని, 3035 ఉద్యోగాలకు నియామకాలు చేపడుతున్నామని చెప్పారు. సిబ్బందికి పనిభారం పెరిగిన మాట వాస్తవమేనని, అయితే 8 గంటల తర్వాత కూడా పనిచేసే వారికి డబుల్ పేమెంట్ చెల్లిస్తున్నామని వెల్లడించారు. అన్ని అంశాలపై స్పందించిన మంత్రి ఆర్టీసీ యూనియన్ పునరుద్ధరణ ఊసెత్తకుండానే ముగించారు.

దివంగత ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో సంతాపం

హైదరాబాద్, జూలై24 (నమస్తే తెలంగాణ): ఇటీవల కన్నుమూసిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలకు బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో సభ్యులు సంతాపం తెలిపారు. చెన్నూరు, నాంపల్లి, నిజామాబాద్ (అర్బన్) మాజీ ఎమ్మెల్యేలు దివంగత నెమరుగొమ్ముల సుధాకర్‌రావు, మహమ్మద్ విరాసత్ రసూల్‌ఖాన్, డీ శ్రీనివాస్ మృతికి సంతాపం ప్రకటించారు. వారి సేవలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొనియాడారు. సభ్యులందరూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

తెలంగాణకు తిరిగివ్వకుంటే పోరాటమే

- ఇక్కడి రక్తంలోనే ఉద్యమ స్ఫూర్తి
- సీపీఐ నేత సాంబశివరావు

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఆవిర్భావం నుంచే కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కక్షగట్టిందని, తెలంగాణ నుంచి లక్షల కోట్ల నిధులు తీసుకుంటున్న కేంద్రం, కనీసం వేలకోట్లు కూడా తిరిగి తెలంగాణకు ఇవ్వడం లేదని సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు సభలో ఆగ్రహం వ్యక్తంచేశారు. మనం రాష్ట్రాలుగా డబ్బులిస్తున్నప్పుడు కేంద్రం కూడా అదేస్ఫూర్తితో రాష్ట్రాలకు నిధులివ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణపై కేంద్రం కక్ష సాధింపు ధోరణిని పోరాటాల ద్వారానే అడ్డుకోవాలని చెప్పారు. తిరుగుబాటు చేయకుంటే మన నిధులు మనకు వచ్చే పరిస్థితి లేదని, పోరాటమనేది తెలంగాణ రక్తంలోనే ఉన్నదని చెప్పారు. రావాల్సిన నిధుల కోసం ఢిల్లీలో ధర్నా చేయడం మంచి సంకేతమని, ఇకనైనా కేంద్రం కండ్లు తెరిచి తెలంగాణకు నిధులివ్వాలని డిమాండ్ చేశారు.

'బ్యాక్‌బెంచ్'పై ఆసక్తికర చర్చ

హైదరాబాద్, జూలై24 (నమస్తే తెలంగాణ): శాసనసభలోఆసక్తికర చర్చ జరిగింది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్, కడి యం శ్రీహరితో పాటు ఇతర ఎమ్మెల్యేలు శాసనసభలో వెనుక బెంచీలో, ఎంఐఎం ఎమ్మెల్యేల సరసన కూర్చున్నారు. దీనిపై సభ్యుల తోపాటు, మీడియా వర్గాల్లోనూ 'బ్యాక్ బెంచ్' అంటూ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలనే చూస్తూ సభ్యులు ఇలా చర్చించుకోవడం గమనార్హం.

ప్రశ్నోత్తరాల సమయం

జీపీలకు పక్కా భవనాలు..

- తండాల నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్లు
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై24 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మిస్తామని, తండాల నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్లు వేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు రాంచందర్‌నాయక్, బీర్ల అయిలయ్య, చిక్కుడు వంశీకృష్ణ పంచాతీయలుగా చేసిన తండాలెన్ని? ఎన్నింటిని రెవెన్యూ పంచాయతీలుగా చేశారు? తండాల అభివృద్ధికి తీసుకున్న చర్యలేంటి? అని ప్రశ్నించారు. సీఎం జోక్యం చేసుకుని తండాలు, గూడేలు అభివృద్ధి చెందితేనే నిజమైన అభివృద్ధి అని, తండాలు, ఆదివాసీ గూడేల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. జీపీలకు భవనాల నిర్మాణంతో పాటు ప్రతి తండా నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు వేస్తామని వెల్లడించారు.

200 యూనిట్లలోపు అందరికీ జీరో బిల్లు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు అందరికీ జీరో బిల్లులు అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం, విద్యుత్తు శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో భాగంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, డాక్టర్ వెంకట్ నర్సింగ్‌రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో అర్హత కలిగిన వారందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తున్నట్టు తెలిపారు. అర్హత కలిగిన వారు గతంలో దరఖాస్తు చేసుకోకుంటే గ్రామీణ ప్రాంతాల వారు మండల కార్యాలయాలు, పట్టణ ప్రాంతాలవారు డివిజన్ కార్యాలయాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 200 యూనిట్లు దాటితే బిల్లు చెల్లించాల్సిందేనని వెల్లడించారు. ఈ స్కీం కోసం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,418 కోట్లు బడ్జెట్‌లో కేటాయించామని వివరించారు.

'తుమ్మిడిహట్టి'కి కట్టుబడి ఉన్నాం: ఉత్తమ్

తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, నవీన్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. సాంకేతిక నిపుణులతో మాట్లాడిన తర్వాత పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సుందిళ్ల, మేడిగడ్డ బరాజ్‌లపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. గంధమల్ల రిజర్వాయర్ అంశం సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నదని ఎమ్మెల్సీ నవీన్ ప్రస్తావించగా భూసేకరణపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. గ్రామస్థులు భూసేకరణకు సహకరిస్తే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

అర్హులకు కొత్త కార్డు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని మంత్రి ఉత్తమ్ స్పష్టంచేశారు. బీఆర్ఎస్ సభ్యులు వాణీదేవి, బస్వరాజు సారయ్య, రఘోత్తమ్‌రెడ్డి, తాతా మధు, జీవన్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. రేషన్‌కార్డుల జారీ మార్గదర్శకాలకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు.

గృహజ్యోతి అర్హులందరికీ ఇండ్లు : మంత్రి పొంగులేటి

బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 25 ద్వారా మంజూరు చేసిన 496 ఇండ్లకు గృహజ్యోతిలో రూ.3 లక్షలకు బదులు రూ.5 లక్షలు మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యుడు తాతా మధు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ ప్రభు త్వం జీవో 25 ద్వారా గృహ నిర్మాణానికి రూ.3 లక్షలు కేటాయించిందని, ఆ స్కీం కింద రూ.496 ఇండ్లను మంజూరు చేసిందని తెలిపారు. ఆ జీవోను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. పేదలకే ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని స్పష్టంచేశారు.

మౌలిక వసతులు కల్పిస్తున్నాం: మంత్రి సీతక్క

రూ.5 లక్షల కంటే తక్కువ వార్షికాదాయమున్న జీపీలకు అదనంగా రూ.5 లక్షలు విడుదల చేస్తూ, మౌలిక వసతులన్నీ కల్పిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్రంలో 6176 పంచాయతీలకు త్వరలో శాశ్వత భవనాలు నిర్మిస్తామని, మల్టీపర్పస్ వర్కర్లు, పారిశుధ్య కార్మికుల వేతనాల కోసం రూ.378.88 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. 1936 లో ల్యాండ్ సర్వే చేశారని, మళ్లీ ఇప్పటివరకు చేయలేదని, ఈ నేపథ్యంలోనే చాలా జీపీలు రెవెన్యూ పంచాయతీలుగా మారలేదని, త్వరలో రెవెన్యూ శాఖతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన : మంత్రి పొన్నం

స్కూల్, కాలేజీ బస్సుల ప్రమాదాలు, ఫిట్‌నెస్ తదితర అంశాలపై సభ్యులు మక్కాన్ సింగ్ ఠాకూర్, ఆది శ్రీనివాస్, వాకిటి శ్రీహరి అడిగి ప్రశ్నలకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిచ్చారు. రాష్ట్రంలో పాఠశాలలకు సంబంధించి 24 వేల బస్సులున్నాయని, పాఠశాలల ప్రారంభానికి నెల ముందు నుంచే ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ తప్పనిసరి చేశామని, డ్రైవర్లు, అటెండర్లందరికీ కౌన్సిలింగ్ ఇస్తున్నామని, 15ఏళ్లు దాటిన వాహనాలను స్క్రాప్ కింద తీసుకుంటున్నామని వెల్లడించారు. పాఠశాల సమయానికి ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నామని, ట్రాఫిక్స్ రూల్స్‌పై ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా అవగాహన కల్పించేందుకు విద్యాశాఖతో సమన్వయం చేసుకుంటున్నట్టు చెప్పారు.

నాకు మంత్రి పదవి సాధ్యమే: రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీలో ఏదైనా సాధ్యమేనని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రివర్గంలో ఉన్నా మంత్రి పదవి అడ్డుకాదని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరినప్పుడే మంత్రి పదవిపై హామీ ఇచ్చారని గుర్తుచేశారు. బుధవారం అసెంబ్లీ లాబీలో రాజగోపాల్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ప్రతిభ, కమిట్‌మెంట్, ప్రామిస్‌తోనే మంత్రి పదవి వస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీగా పనిచేశానని, ఏదో ఒక సమయంలో ముఖ్యమంత్రిని కావొచ్చని జోస్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రజలందరూ తనను హోం మంత్రి కావాలని పదే పదే అడిగారని గుర్తుచేశారు.

మీడియా పాయింట్

చెరో 8 సీట్లు గెలిచి 8 పైసలు తీసుకురాలే :ఎమ్మెల్యే కేవీ

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం నుంచి చెరో 8 స్థానాల్లో గెలిచిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు 8 పైసలు తీసుకురాలేదని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేంద్రం నిధులు ఇవ్వకున్నా స్వశక్తితో తెలంగాణను కేసీఆర్ అభివృద్ధి చేశారని గుర్తుచేశారు.

తెలంగాణకు తీవ్ర అన్యాయం: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి రూ.15 వేల కోట్ల ఇచ్చి తెలంగాణకు రూపాయ ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణకు శ్రీరామరక్ష అని మరోసారి రుజువైందని చెప్పారు.

రైతుభరోసా ఇస్తారా? లేదా ?: ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీజన్ ప్రారంభంలోనే రైతుల ఖాతాల్లో రైతుబంధు జమచేసేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి గుర్తుచేశారు. కలుపు తీయడానికి వచ్చినా రైతుభరోసా ఇవ్వలేదని మండిపడ్డారు.

కేంద్రంపై కక్ష బహిర్గతం: ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వంపై ప్రధాన ప్రతిపక్షం, పాలకపక్షం కక్ష సభలో బయటపడ్డదని ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి తెలిపారు. ఇది వికసిత భారత్ బడ్జెట్ అని పేర్కొన్నారు. అన్ని అంశాలు ప్రధాని మోదీ దృష్టిలో ఉన్నాయని తెలిపారు.

అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే: ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాంగ్రెస్ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కేంద్ర బడ్జెట్‌పై చర్చ పెట్టిందని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆరోపించారు. పదేండ్ల క్రితం అదిలాబాద్ జిల్లాలో ఒకే కేంద్రీయ విద్యాలయముంటే, కేంద్ర ప్రభుత్వం 4 మంజూరు చేసిందని చెప్పారు.

ఎదుగుదల ఓర్వలేక నిందలు: ఎమ్మెల్యే సూర్యనారాయణ

రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలనుచూసి ఓర్వలేక కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నిందలు వేస్తున్నారని నిజామాబాద్ అర్బన్ బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇస్తుందని, ఒక రాష్ట్రానికి మాత్రమే నిధులు ఇవ్వదని పేర్కొన్నారు.

హామీల అమలు కనబడటం లేదు: పాయల్ శంకర్

కాంగ్రెస్ సర్కారు తీరు చూస్తుంటే ఆరు గ్యారెంటీలు అమలుచేసేవిధంగా కనబడటం లేదని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతతో కేంద్రంపై నిందవేయడానికి శాసనసభలో తీర్మానం చేశారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలి

- లేదంటే నిరుద్యోగులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి
- రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తరు?
- ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా ఎప్పుడు గుర్తిస్తరు?
- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీమంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తామన్న రేవంత్‌రెడ్డి, గద్దెనెక్కిన తర్వాత మర్చిపోయారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మెగా డీఎస్సీ ప్రకటించాలని, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, యూనియన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి హరీశ్‌రావు మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల విషయం సభలో చర్చకు వచ్చినప్పుడు తాము సూటిగా ప్రశ్నలు వేసినప్పటికీ ప్రభుత్వం సమాధానం చెప్పకుండా పారిపోయిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఏం చెప్పిందో, ఇప్పుడు ఏం చేస్తున్నదో ఆర్టీసీ కార్మికులు గమనిస్తున్నారని చెప్పారు. ఫిబ్రవరిలో ఆర్టీసీకి ముఖ్యమంత్రి ఇచ్చిన రూ.300 కోట్ల చెక్కు డమ్మీ అయింది. దాని సంగతి అడిగితే సమాధానం చెప్పలేదు. మహిళల ఉచిత బస్సులకు సంబంధించి ఏప్రిల్, మే నిధులు ఇవ్వలేదు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ఎరియర్స్ , బకాయిలు ఇవ్వాలి, యూనియన్‌ను పునరుద్ధరించాలని అడిగితే ఒక్కదానికీ ప్రభుత్వం సమాధానం చెప్పలేదు. ఆర్టీసీ కార్మికుల ఓట్లతో గెలిచి నేడు వారికి వెన్నుపోటు పొడిచింది. ఆర్టీసీ కార్మికుల పక్షాన సభలో, బయట ప్రభుత్వాన్ని నిలదీస్తాం' అని హరీశ్‌రావు హెచ్చరించారు. నిరుద్యోగుల సమస్యపై మాట్లాడే అవకాశం ఇవ్వాలని వాయిదా తీర్మానం కోరితే స్పీకర్ తిరస్కరించారని ఫైర్ యయ్యారు. అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ఇస్తామని, పత్రికల్లో, టీవీల్లో తేదీలతో సహా యాడ్స్ ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి ఊసరవెల్లులు సైతం సిగ్గుపడుతున్నాయని ఎద్దేవాచేశారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గాలకు చెందిన ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని మండిపడ్డారు. తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి, నిరుద్యోగులపై లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి.. మెగా డీఎస్సీయా.. దగా డీఎస్సీయా.. అనే ప్లకార్డులు ప్రదర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, పాడి కౌశిక్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, విజేయుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తెచ్చిన జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం

గ్రూప్ -1 విషయంలో జీవో 55 రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పుడు మెయిన్స్‌లో 1:50 పద్ధతిలో అభ్యర్థులను పిలుస్తున్నారని, ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో జగన్మోహన్‌రెడ్డి ప్రభు త్వం 1:100 పద్ధతి పాటించారని గుర్తుచేశా రు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభు త్వం ఇచ్చిన నోటిఫికేషన్‌కు 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వం సప్లిమెంటరీ నోటిఫికేషన్ ఇ చ్చి అదనపు ఉద్యోగాలు కల్పించిందని చెప్పా రు. అప్పుడు రాని సమస్యలు ఇప్పుడెందుకు వస్తాయని ప్రశ్నించారు.

మండలి సమావేశాలు తొలిరోజు ప్రశాంతం

- డీఎస్‌కు అంజలి ఘటించిన మ